# సరికొత్త వ్రతం

శంకరుడు భార్య పార్వతిని అర్ధదేహంలో పెట్టుకున్నాడు. బ్రహ్మ దేవుడు నాలుకమీద పెట్టుకున్నాడు. విష్ణుమూర్తి వక్షః స్థలం మీద పెట్టుకున్నాడు. ఇలా త్రిమూర్తులు సహితం తమ అర్ధనారీమణులకు సముచిత స్థానం కల్పించినందుకు చంద్రునికి, వసంతునికి మిత్రుడయి ఆ మన్మథునికి నమస్కారం అని భర్తృహరి యోగీంద్రుడు వర్ణించాడు.

శంకర పద్మగర్భ మురశాసనులన్ భువనేశులన్ నిరా
తంక ధృతిన్ మృగాక్షులకు దాసుల జేసిన మేటికన్, కురం
గాంక వసంత మిత్రునకు అంజలి చేసెద! వాగతీతని
శ్శంక చరిత్ర చిత్రునకు షడ్గుణహారకి శంబరారికిన్!

ఈ విధంగా తమ తమ భార్యామణులకు సముచిత స్థానం కల్పించిన సృష్టిస్థితి లయకారులైన త్రిమూర్తులను ఆదర్శంగా తీసుకోకుండా నేటి యువకులు విచ్చలవిడి శృంగారం నెరపి పరాయి స్త్రీలతో పొందుకోరుతున్నారెందుకో?

ఆడది ఒంటరిగా ఏ సినిమా హాల్లోనో ఏ పార్కులోనో కనిపిస్తే ఆమె ఎవరా? మనం ట్రై చేస్తే లొంగుతుందా? అని ఆమె ప్రక్కసీటు ఖాళీగా వుంటే ఆ సీట్లో కూర్చోడానికి ప్రయత్నిస్తారు యువకులు ఆ కూర్చున్నవాళ్లు తిన్నగా వుంటారా? ఆమె రెస్పాన్స్ ఎలా వుంటుందో చూద్దామని, ఆమె కాలుకి కాలు తగిలిస్తారు. అలాగే ఒంటరిగా ఒక అందమైన మగాడు కూర్చుంటే ఆడవాళ్లు అతని వెంట ఎందుకు పడరో? చిత్రాతి చిత్రాల్లో ఇదొకటి!

ఆ విధంగా చూస్తే ఆడది అబలకాదు, మగాడే అబలుడు! మహాకవి కాళిదాసుకి, కాళికాదేవి విద్యాదానం చేసినప్పుడు ఆ తల్లిని 'కుచోన్నతే కుంకుమరాగశోణే' అని వర్ణించాడు. లీలాశుకుడు శ్రీకృష్ణకర్ణామృతంలో అంటాడు".

రాధాపునాతు జగతు అచ్యుత దత్తచిత్తా
మంథాన మాకలయతీ దధిరిక్త పాత్రే
తస్యాః స్తనస్తబక చంచల లోలదృష్టిః
దేవోపి దోహనధియా వృషభం నిరుద్ధన్

అచ్యుతనిపై మనస్సు లగ్నం చేసుకుని ఖాళీ పెరుగు కుండను చిలుకుతున్నటువంటి రాధాదేవి ఈ జగత్తును పునీతం చేయుగాక! అలాగే రాధాదేవి

స్తనాల గుత్తిపై తన చంచల దృష్టిని నిలిపి ఆవుపాలు పిదుక బోయి ఎద్దుని పిదుకుతున్నాడు గోపాలుడు.

పై ఉదాహరణలలో వేదాంతార్థాలు అనేకం మాన్యులకు గోచరిస్తాయిగాని సామాన్యులకు ఎలా గోచరిస్తాయి? వారికి భౌతికార్థాలే గోచరిస్తాయి.

హేమాంగి అనే పాతికేళ్ళ యువతి ఎత్తైన వక్షఃస్థలం చూడగానే అనేకులైన యువకులకి పిచ్చెక్కుతోంది. ఆమెను చూడగానే 70-80 మధ్యనున్న వయోవృద్ధులు కూడా చ్యవనప్రాస సిద్ధమకరధ్వజం వసంతకుసుమాకరం వయాగ్రా సేవించినట్లు ఫీలయిపోతుంటే, యౌవనవంతులకెలావుంటుందో చెప్పాలా? అందులోకి చీర కడితే పైట వెనుక వున్న అందాలు గోచరించవు గాని పంజాబీ డ్రస్సువేస్తే గోచరించవా?

ఇంగ్లాండుని పాలించిన మహారాజు ఛార్లెస్-2 (1667-74) ఆస్థానంలో దుష్టపంచకం వుండేవారు. వాళ్ల పేర్లు క్లిఫోర్డు (CLIFFORD), ఆర్లింగ్‌టన్ (ARLINGTON), బకింగ్ హామ్స్ డ్యూక్, (DUKEOFBUCKINGHAM) ఆష్లే (ASHLAY) లాడర్‌డేల్ (LAUDERDALE) వాళ్ల పేర్లలో మొదటి అక్షరాలతో CABAL అని ఈ దుష్టపంచకాన్ని పిలిచేవారు.

అలాంటి ఐదుగురు యువకులు, హేమాంగి ఒంటరిగా ఎప్పటికైనా చిక్కకపోతుందా అని ఎదురుచూస్తున్నారు.

చివరికి ఒంటరిగానే చిక్కింది.

"హేమాంగీ! ఆగు!" అన్నాడో యువకుడు.

"ఎందుకుట?" అందామె.

"ఎందుకేమిటి? నువ్వు మాక్కావాలి".

"నేనలాంటిదాన్ని కాను"

"మరి ఈ పతివ్రత కబుర్లు చెప్పకు!" అన్నాడొకడు.

"ఒరేయ్! మనకు తెలిసిన పతివ్రత గురించి క్లాసు తీసుకోరా!" అన్నాడింకోడు.

"అలాగేరా! ఇదుగో చెబుతున్నా చూడమ్మా హేమాంగీ! ఒక సంప్రదాయ కుటుంబంలో పుట్టిన భారతీయుడు ఒక పశ్చిమదేశానికి ఉద్యోగం కోసం వెళ్ళాడు. అక్కడొక సిమెటరిలో ఒకామె తన భర్త సమాధికి విసనకర్ర పట్టుకుని విసురుతోంది ఓహో పతివ్రతా శిరోమణుల భారతదేశంలోనే ఉన్నారనుకుంటున్నాను ఇక్కడ కూడా ఉన్నారా? అని చోద్యపడ్డాడు. ఆ పతివ్రతాశిరోమణిని సమీపించి అమ్మా! మీ పాతివ్రత్యానికి జోహార్లు! భర్త చనిపోయిన తరువాత కూడా అతని సమాధికి విసనకర్రతో విసురుతున్నారంటే నిజంగా గ్రేట్!" అన్నాడు. అందుకు ఆ పాశ్చాత్య నారీమణి ఏమందో తెలుసా? 'ఓయ్ వెర్రివాడా! మా ఆయన చనిపోయేముందు తనకు కట్టిన సమాధి తడి ఆరేవరకూ మళ్ళీ పెళ్ళిచేసుకోవద్దని చేతిలో చేయినేసి నా చేత ప్రమాణం చేయించుకున్నాడు. మాది చలిదేశం ఎప్పుడూ మంచు కురుస్తూంటుంది. ఈ సమాధి తడి ఎప్పటికీ ఆరడంలేదు. అందుకే విసనకర్రతో విసరి తడి ఆరగానే మరొక ప్రియుణ్ని పెళ్లాడదామనుకుంటున్నాను. అంది ఆ ఇల్లాలు" అని చెప్పాడు మరొకడు.

"అది పశ్చిమదేశాల ఆచారం. మనం భారతీయులం. ఆ ఉదాహరణ మనకెలా సరిపడుతుంది?" అడిగింది హేమాంగి.

"నీలాంటి ఆడవాళ్లు పాశ్చాత్యుల్లాగే తయారవుతున్నారు. లేక పోతే ఆ జుత్తు కత్తిరించుకోడమేమిటి? ఛాతి ఎత్తుగా కనబడేటట్లు పల్చని దుస్తులేమిటి?"

"ఇంతకీ నాలో ఏ ఆకర్షణ వుందని నా పొందు కోరుతున్నారు మీరు?"

"నీ ఎత్తైన ఛాతీయే మమ్మల్ని నీపైకి ఉసిగొల్పుతోంది"

"ఎత్తైన ఛాతీ అన్నది, వివాహం అయేక పుట్టబోయే బిడ్డలకి ఆహారం కోసం సృష్టిలో భగవంతుడు ఏర్పాటు చేసిన వరం. అంచేత దయచేసి నన్ను విడిచిపెట్టండి" బ్రతిమాలింది హేమాంగి చేతులు జోడించి.

"అదుగో! ఆ పతివ్రత కబుర్లే వద్దంటున్నాం. నువ్వు స్టార్ హోటల్లో ఒకడితో భోంచేశావు. ఇంకొకడితో గార్డెన్ రెస్టారెంటులో కిలకిల నవ్వుతూ ఐస్‌క్రీములు తిన్నావు. కొందరితో టాటా సుమోలో షికార్లు కొట్టావు. నువ్వు మొత్తంమీద 70 పుంజీల మందితో చక్కర్లు కొట్టావని మా కంప్యూటర్‌లో లోడ్ చేసి ఉంచాం".

"అయితే మీరిప్పుడు ఎంతమంది ఉన్నారు?

"ఐదుగురం"

"అయితే నేను 70 పుంజీల మందితో తిరిగేనని అంటున్నారే! పుంజీ అంటే నాలుగు. 70x4=280. మీరిప్పుడు ఐదుగురున్నారు. అంటే మొత్తం 285 మంది. నావ్రతం పూర్తవడానికి ఇంకా పదిహేను మంది తక్కువవుతున్నారే!" అంది హేమాంగి.

"అదేంటి ఆ వ్రతం?" అన్నాడో యువకుడు.

"మొత్తం 300 మందితో నేను పొందు కోరాలని!"

"అయితే మా ఐదుగురి కోరికా ముందు తీర్చేస్తే మేము మరో పదిహేనుమందిని మటాడోర్ వ్యానులో తీసుకొస్తాం"

"అలా కుదరదు. వాళ్లని కూడా ఇప్పుడే తీసుకొచ్చేయండి. మొత్తం నావ్రతం ఇప్పుడే పూర్తవుతుంది!"

"నువ్వు చెప్పిన వ్రతం స్త్రీల వ్రతకథల్లో ఎక్కడా కనబడదే?"

"నాది సరికొత్త వ్రతం. నావల్ల ఇప్పటికి మీరు కాక మరో పదిహేను మంది కలిస్తే మొత్తం 300 మందికి హెచ్ఐవి పాజిటివ్ రావాలన్నదే నా కొత్త వ్రతం!" అంది హేమాంగి. అంతే! దెబ్బకి ఢామ్మని మూర్ఛపోయారు యువ దుష్టపంచకం. తెలివి వచ్చేక మోటారు సైకిళ్ళ మీద ఉడాయించారు.

హేమాంగి ఉత్తుత్తి హెచ్ఐవి బాంబు పేల్చి తన మానాన్ని కాపాడుకుని, తన మానాన తను, ప్రియుడు హేమాంబరధరాన్ని పెళ్ళాడి మరో రాష్ట్రంలో ఉడా కోలనీలోని ఇంటికి ఉడాయించింది.

**8-1-2004**

**"ఆంధ్రభూమి" దినపత్రిక**

కథా నిలయం
5845
శ్రీకాకుళం